# రాణా వేగానికి కంగారూలు బెంబేలు



**ఢాకా, జూన్ 10 :** ఆస్ట్రేలియాపై తొలి వన్డేలో బంగ్లాదేశ్ సంచలన విజయం సాధించిన నేపథ్యంలో యువ పేసర్ నహీద్ రాణా ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తన వేగవంతమైన బౌలింగ్‌తో ఆస్ట్రేలియా బ్యాటర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన రాణా, ప్రత్యర్థి తాత్కాలిక కెప్టెన్ జోష్ ఇంగ్లిస్ వికెట్ తీసిన అనంతరం మైదానంలో చోటుచేసుకున్న సంఘటనతో మరింత చర్చనీయాంశంగా మారాడు. డక్‌వర్త్-లూయిస్ విధానం ప్రకారం 86 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ ఘన విజయం నమోదు చేసిన ఈ మ్యాచ్‌లో రాణా తన బౌలింగ్‌తో ఆస్ట్రేలియా బ్యాటింగ్ క్రమాన్ని కుదేలు చేశాడు. ఛేదనలో భాగంగా 11వ ఓవర్‌లో రాణా విసిరిన వేగవంతమైన బౌన్సర్‌ను ఆడే క్రమంలో ఇంగ్లిస్ బ్యాట్‌కు తగిలిన బంతి వికెట్ కీపర్ చేతుల్లో పడింది. దీంతో వికెట్ దక్కించుకున్న రాణా ఉత్సాహంగా సంబరాలు చేసుకున్నాడు. అయితే ఆ సంబరాల తీరు నచ్చని ఇంగ్లిస్ అసహనానికి గురై రాణాతో వాగ్వాదానికి దిగాడు. కొద్దిసేపు ఇద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగగా, పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా బంగ్లాదేశ్ కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్ జోక్యం చేసుకుని ఇంగ్లిస్‌ను శాంతింపజేశాడు. ఆ సమయంలో ఆస్ట్రేలియా జట్టు 51 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో ఉంది. ఇంగ్లిస్ వికెట్ అనంతరం ఆ జట్టు మరింత కష్టాల్లో పడగా, బంగ్లాదేశ్ బౌలర్లు పూర్తి ఆధిపత్యం చెలాయించారు. మ్యాచ్ గమనాన్ని మార్చిన కీలక ఘట్టంగా ఈ వికెట్ నిలిచిందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక రాణా, ఇంగ్లిస్ మధ్య జరిగిన ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. రాణా వేగం, దూకుడైన బౌలింగ్‌పై బంగ్లాదేశ్ అభిమానులు ప్రశంసలు కురిపిస్తుండగా, భవిష్యత్తులో అతడు జాతీయ జట్టుకు ప్రధాన బలంగా మారతాడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# భారత్‌కు షాక్

## ఆఫ్ఘనిస్తాన్ వన్డే సిరీస్‌కు హార్దిక్ పాండ్యా దూరం!

**మొహాలి, జూన్ 10 :** ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు ముందు భారత జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా గాయంతో ఈ సిరీస్‌కు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల బెంగుళూరులోని బీసీసీఐ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసి ఆడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించిన పాండ్యా, తాజాగా మళ్లీ కాలు నొప్పితో బాధపడుతున్నట్లు సమాచారం. ఆఫ్ఘనిస్తాన్‌తో సిరీస్‌లో ఆడాలనే లక్ష్యంతో గత కొన్ని రోజులుగా పాండ్యా తీవ్రంగా శ్రమించాడు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లో బ్యాటింగ్‌తో పాటు పూర్తి స్థాయి బౌలింగ్ ప్రాక్టీస్ కూడా నిర్వహించాడు. ఏకంగా పది ఓవర్లు బౌలింగ్ చేసి తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్నాడు. దీంతో అతడు సిరీస్‌కు అందుబాటులో ఉంటాడని బీసీసీఐ కూడా ప్రకటించింది. అయితే చివరి దశలో మళ్లీ కాలు నొప్పి తిరగబెట్టడంతో జట్టు యాజమాన్యం అతడిని సిరీస్‌కు దూరంగా ఉంచాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. వైద్యుల సూచన మేరకు పాండ్యా మరో రెండు వారాల పాటు బెంగుళూరులోనే ఉండి పునరావాస కార్యక్రమంలో పాల్గొననున్నాడు. బీసీసీఐ వర్గాల సమాచారం ప్రకారం, పాండ్యాకు తీవ్రమైన గాయం ఏదీ కాకపోయినా కాలులోని కొన్ని కండరాలు బలహీనంగా ఉండటంతో నొప్పి వస్తోందని తెలుస్తోంది. భవిష్యత్తులో సమస్య మరింత పెరగకుండా జాగ్రత్త చర్యగా విశ్రాంతి ఇవ్వాలని వైద్య బృందం సూచించినట్లు సమాచారం. ప్రస్తుతం ఫిజియోలు, ట్రైనర్ల పర్యవేక్షణలో అతడు ప్రత్యేక శిక్షణ తీసుకోనున్నాడు. ఇక శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని భారత వన్డే జట్టు గురువారం మొహాలీలో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించనుంది. అక్కడి నుంచి జట్టు ధర్మశాలకు బయలుదేరనుంది. హార్దిక్ పాండ్యా గైర్హాజరీతో జట్టులో ఆల్‌రౌండర్ విభాగంలో మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాండ్యా త్వరగా కోలుకుని మళ్లీ జట్టులోకి రావాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అతని గైర్హాజరీ భారత జట్టుకు లోటే అయినప్పటికీ, యువ ఆటగాళ్లకు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభించనుంది.

# మెస్సీ మెరుపులు.. అర్జెంటీనాకు విజయం

**బ్యూనస్ ఐరెస్, జూన్ 10 :** ప్రపంచకప్‌కు ముందు జరిగిన చివరి సన్నాహక మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఐస్‌లాండ్‌పై 3-0 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించి తమ బలాన్ని మరోసారి నిరూపించింది. ఈ మ్యాచ్‌లో గాయంతో కొంతకాలం దూరమైన కెప్టెన్ లియోనెల్ మెస్సీ మైదానంలోకి తిరిగి వచ్చి అభిమానులను అలరించాడు. కేవలం 20 నిమిషాల పాటు మాత్రమే ఆడిన మెస్సీ ఒక గోల్ సాధించడమే కాకుండా మరో రెండు గోల్స్‌కు దారితీసే అద్భుత పాస్‌లు అందించాడు. అతడి రాకతో అర్జెంటీనా దాడులు మరింత పదునెక్కాయి. మ్యాచ్ ఆరంభంలో మెస్సీ ఇచ్చిన అద్భుత పాస్‌ను అందుకున్న స్టార్ ఫార్వర్డ్ లౌటారో మార్టినెజ్ గోల్‌గా మలిచి అర్జెంటీనాకు ఆధిక్యం అందించాడు. అనంతరం మెస్సీ స్వయంగా గోల్ సాధించి జట్టు ఆధిక్యాన్ని రెండింతలు చేశాడు. కొద్ది సేపటికే మరో చక్కటి పాస్‌తో యువ ఆటగాడు థియాగో అల్మాడాకు అవకాశం కల్పించగా, అతడు మూడో గోల్ నమోదు చేశాడు. మెస్సీ నాయకత్వంలో అర్జెంటీనా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించగా, ఐస్‌లాండ్ జట్టు ఒక్క గోల్ కూడా నమోదు చేయలేకపోయింది. ఈ విజయంతో ప్రపంచకప్‌కు ముందు అర్జెంటీనా శిబిరంలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. ప్రపంచకప్‌లో అర్జెంటీనా తన తొలి మ్యాచ్‌ను జూన్ 16న అల్జీరియాతో ఆడనుంది. మెస్సీ ఫిట్‌నెస్, ఫామ్ జట్టుకు ప్రధాన బలంగా మారడంతో టైటిల్ రక్షణపై అభిమానుల్లో ఆశలు మరింత పెరిగాయి.



# కౌంటీ క్రికెట్‌లోకి మానవ్ సుతార్

**ముంబై, జూన్ 10 :** ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న యువ స్పిన్నర్ మానవ్ సుతార్‌కు ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లో ఆడే అవకాశం లభించింది. ఇంగ్లండ్‌కు చెందిన వార్‌విక్‌షైర్ కౌంటీ క్రికెట్ క్లబ్‌తో ఆయన స్వల్పకాలిక ఒప్పందం కుదుర్చుకున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఇటీవల ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌లో అరంగేట్రం చేసిన రాజస్థాన్‌కు చెందిన ఎడమచేతి స్పిన్నర్ మానవ్ సుతార్ తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టును తీవ్రంగా దెబ్బతీశాడు. రెండో ఇన్నింగ్స్‌లో మరో వికెట్ సాధించి మొత్తం ఏడు వికెట్లతో తన ప్రతిభను చాటుకున్నాడు. ఈ ప్రదర్శనతో అంతర్జాతీయ క్రికెట్ వర్గాల దృష్టిని ఆకర్షించిన సుతార్‌కు ఇప్పుడు కౌంటీ క్రికెట్‌లో అవకాశాలు దక్కుతున్నాయి. వార్‌విక్‌షైర్ జట్టు తరఫున రోతేసే కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో జరిగే తదుపరి రెండు రౌండ్ల మ్యాచ్‌లలో సుతార్ ఆడనున్నాడు. యార్క్‌షైర్, సోమర్‌సెట్ జట్లతో జరిగే కీలక పోటీలకు ఆయన అందుబాటులో ఉండనున్నట్లు క్లబ్ వెల్లడించింది. మానవ్ సుతార్ దేశీయ ప్రథమశ్రేణి క్రికెట్‌లో కూడా అద్భుతమైన రికార్డును కలిగి ఉన్నాడు. ఇప్పటివరకు 29 ప్రథమశ్రేణి మ్యాచ్‌లు ఆడిన ఆయన 129 వికెట్లు సాధించి తన స్థిరమైన ప్రదర్శనతో గుర్తింపు పొందాడు. ఇంగ్లండ్ పరిస్థితుల్లో కౌంటీ క్రికెట్ ఆడటం ద్వారా సుతార్‌కు విలువైన అంతర్జాతీయ అనుభవం లభించనుంది. ముఖ్యంగా ఆగస్టులో శ్రీలంకతో జరగనున్న టెస్టు సిరీస్‌కు ముందు ఈ అనుభవం అతడి ఆటకు మరింత పదును పెట్టే అవకాశం ఉందని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మానవ్ సుతార్ మా జట్టులో చేరడం ఎంతో సంతోషంగా ఉందని వార్‌విక్‌షైర్ ప్రదర్శన విభాగం డైరెక్టర్ జేమ్స్ థామస్ తెలిపారు. అతడి ప్రతిభ జట్టుకు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కౌంటీ క్రికెట్‌లో రాణించి భారత జట్టులో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని సుతార్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.



# ఆసియా క్రీడలకు పాకిస్థాన్ యువ జట్టు




**లాహోర్, జూన్ 10 :** జపాన్‌లోని ఐచి-నగోయా వేదికగా జరగనున్న ఆసియా క్రీడలు-2026 కోసం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు 15 మంది సభ్యులతో కూడిన పురుషుల జట్టును ప్రకటించింది. ఈసారి బాబర్ ఆజం, షాహీన్ అఫ్రిది, షాదాబ్ ఖాన్ వంటి సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చి యువ ఆటగాళ్లకు అవకాశమిచ్చింది. జట్టుకు అనుభవజ్ఞుడైన ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్‌ను కెప్టెన్‌గా నియమించగా, యువ బ్యాటర్ అబ్దుల్ సమద్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించారు. ఇటీవల ముగిసిన ప్రపంచ టీ20 టోర్నీలో ఫర్హాన్ అద్భుత ప్రదర్శన కనబరిచి జట్టు తరఫున అత్యధిక పరుగులు సాధించాడు. ఇప్పటివరకు 46 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడిన అతడు 1,305 పరుగులు నమోదు చేశాడు. ఇందులో రెండు శతకాలు, పది అర్ధశతకాలు ఉన్నాయి. వైస్ కెప్టెన్ అబ్దుల్ సమద్ ఇప్పటివరకు ఐదు అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడగా, ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో కూడా భాగమయ్యాడు. యువ ఆటగాళ్లకు ప్రాధాన్యం ఇస్తూ పాకిస్థాన్ బోర్డు అకిఫ్ జావెద్, అలీ రజా, మాజ్ సదాఖత్, సాద్ మసూద్‌లకు తొలిసారి అవకాశం కల్పించింది. టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ మెగా క్రీడల కోసం ఎంపికైన ఆటగాళ్లు జూన్ 15 నుంచి 18 వరకు లాహోర్‌లో నిర్వహించే ప్రత్యేక శిక్షణ శిబిరంలో పాల్గొననున్నారు. జాతీయ క్రికెట్ అకాడమీలో జరిగే ఈ శిబిరంలో ఫిట్‌నెస్, పవర్ హిట్టింగ్, మ్యాచ్ పరిస్థితులను ఎదుర్కొనే నైపుణ్యాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నారు. యువ ఆటగాళ్లతో కూడిన ఈ జట్టు ఆసియా క్రీడల్లో పాకిస్థాన్‌కు పతకం అందించాలనే లక్ష్యంతో బరిలోకి దిగనుంది. సీనియర్ ఆటగాళ్ల గైర్హాజరీలో యువత తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఇది కీలక అవకాశంగా మారింది.

# ఒలింపిక్స్ జట్టులో కోహ్లీ ఉండాల్సిందే: శ్రీశాంత్



**ముంబై, జూన్ 10 :** 128 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒలింపిక్స్ క్రీడల్లో క్రికెట్ మళ్లీ చోటు దక్కించుకోనున్న నేపథ్యంలో భారత జట్టు కూర్పుపై ఆసక్తికర చర్చలు ప్రారంభమయ్యాయి. 2028లో అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో జరగనున్న ఒలింపిక్స్‌లో భారత జట్టు స్వర్ణ పతక లక్ష్యంతో బరిలోకి దిగనున్న వేళ, మాజీ భారత పేసర్ శ్రీశాంత్ కీలక సూచన చేశాడు. అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని ఒలింపిక్స్ జట్టులో ఎంపిక చేయాలని సెలక్టర్లను కోరాడు. ఒక యూట్యూబ్ కార్యక్రమంలో మాట్లాడుతూ, ఒలింపిక్స్ వంటి ప్రతిష్ఠాత్మక టోర్నీలో కోహ్లీ అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డాడు. విరాట్ కోహ్లీ అనుభవానికి యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ దూకుడు జతైతే భారత జట్టు మరింత బలంగా మారుతుందని శ్రీశాంత్ పేర్కొన్నాడు. సీనియర్, యువ ఆటగాళ్ల సమన్వయంతో జట్టుకు సమతుల్యత ఏర్పడుతుందని చెప్పాడు. 2024 టీ20 ప్రపంచకప్ విజయానంతరం కోహ్లీ టీ20 ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ, అతని ఫిట్‌నెస్ ఇప్పటికీ అత్యున్నత స్థాయిలో ఉందని శ్రీశాంత్ గుర్తు చేశాడు. కోహ్లీ శారీరక దృఢత్వం, మ్యాచ్ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని అతడిని ఒలింపిక్స్ జట్టులోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశాడు. 1900 తర్వాత తొలిసారి ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు అవకాశం లభించింది. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో ఆరు జట్ల చొప్పున టీ20 ఫార్మాట్‌లో పోటీలు నిర్వహించనున్నారు. క్రికెట్‌తో పాటు బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్, స్క్వాష్ క్రీడలకు కూడా చోటు కల్పించారు. ఇక యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ ఇటీవల ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. 2026 సీజన్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలిచి భారత జట్టులో తొలి అవకాశాన్ని దక్కించుకున్నాడు. కోహ్లీ వంటి అనుభవజ్ఞుడితో పాటు వైభవ్ వంటి యువ ప్రతిభ కలిస్తే భారత జట్టు ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకానికి బలమైన పోటీదారుగా నిలుస్తుందని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

